సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 14 । మే । 2024



20న పైడితల్లి దేవర మహోత్సవం

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం నిర్వహణకు తలయారీలు చాటింపు వేశారు. - 8లో



ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

జిల్లాలో సాధారణ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. - 8లో

వర్షంతో ఓటింగ్‌కు ఇబ్బందులు

భామిని: మండలంలో సోమవారం కురిసిన వర్షంతో సాధారణ ఎన్నికల ఓటింగ్‌కు ఇబ్బందులు కలిగాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పోలింగ్‌లో కాస్త జాప్యం ఏర్పడినప్పటికీ తరువాత గొడుగులు పట్టుకుని పోలింగ్ బూత్‌లకు చేరుకుని ఓటింగ్‌లో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

1330 మద్యం బాటిల్స్ స్వాధీనం

సీతంపేట: మండలంలోని బిల్లుమడ జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 1330 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. ఆదివారం రాత్రి కొత్తూరు నుంచి పాలకొండకు బైక్‌పై తరలిస్తుండగా మార్గమధ్యంలో వాహనాల తనిఖీలో భాగంగా మద్యం బాటిల్స్ పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రశాంతంగా ఎన్నికలు

- అరకు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు



పోలింగ్ కేంద్రంలో ఎన్నికల తీరు పరిశీలిస్తున్న అరకు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా

వీరఘట్టం: అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో సోమవారం సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని అరకు పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వీరఘట్టం మండలంలోని నడుకూరు, విక్రమపురం, నడిమికెల్ల, వీరఘట్టంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటువేసేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఆయనతో పాటు జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం వెంకటేశ్వరరావు, వీరఘట్టం తహసీల్దార్ కె.జయప్రకాశ్ తదితరులున్నారు.

బతికుండగా ఓటు తొలగింపుపై ఆగ్రహం



ఆవేదన వ్యక్తం చేస్తున్న నల్లయ్య

వీరఘట్టం: బతికుండగానే తన ఓటును అధికారులు జాబితా నుంచి తొలగించారని వీరఘట్టంలోని సీబీఎం వీధికి చెందిన అరసాడ నల్లయ్య ఆందోళన వ్యక్తం చేశాడు. వీరఘట్టం బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రానికి ఓటు కార్డు పట్టుకుని సోమవారం ఓటు వేసేందుకు నల్లయ్య వచ్చాడు.అయితే జాబితాలో నల్లయ్య పేరు డిలిట్ కొట్టడంతో ఓటు వేసేందుకు అధికారులు అంగీకరించలేదు. బతికుండగానే మనుషుల్ని చంపేస్తారా? అంటూ నల్లయ్య ఎన్నికల అధికారుల తీరుపై మండిపడ్డాడు.

ఓటు సిప్పలతో టీడీపీ మేనిఫెస్టో పంపిణీ



తాడికొండ పోలింగ్ కేంద్రం ఆవరణలో టీడీపీ నాయకులు పంచుతున్న టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టోతో కలిపి ప్రచురించిన ఉన్న ఓటరు స్లిప్పులు



టీడీపీ ప్రచురించిన మేనిఫెస్టోతో కూడిన ఓటు స్లిప్పులను చూపుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ తోయక గోపాల్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో 81వ పోలింగ్ కేంద్రం పరిధిలో కొంత మంది టీడీపీ నాయకులు సోమవారం ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లకు ఓటు స్లిప్పుతో పాటు టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సిక్స్‌ను కూడా ప్రచురించి అందజేశారు. ఎన్నికలకు రెండు రోజుల ముందే ఎన్నికల ప్రచారం నిలిపివేసినప్పటికీ..ఆ నిబంధనలను పక్కన పెట్టిన టీడీపీ నాయకులు ఓటు వేసేందుకు వెళ్లే ఓటర్లకు టీడీపీ మేనిఫెస్టోను కూడా ఓటరు స్లిప్పులతో ప్రచురించి ఇస్తుండడం గమనించిన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వారితో వాగ్వాదానికి దిగగా వాటి పంపిణీని నిలిపివేశారు. దీనిపై స్పందించిన వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ తోయక గోపాల్ మాట్లాడుతూ ఎన్నికల వేళ టీడీపీ నాయకులు ఇలా బరితెగించడం మంచి పద్ధతి కాదన్నారు.

లీడర్ కోసం





నర్సిపురం పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు (ఇన్‌సెట్లో) సాలూరులో ఓటు వేసి వస్తున్న వృద్ధురాలు

- పోటెత్తిన ఓటర్లు
- జిల్లాలో 75.24 శాతం నమోదు, రాత్రి 11 వరకూ పోలింగ్
- అరకు పార్లమెంట్‌లో 69.26 శాతం పోలింగ్
- ఉదయం 7 గంటల నుంచే బారులు
- సాయంత్రం నిర్ణీత సమయం దాటినా క్యూలో జనం
- కొన్నిచోట్ల టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం
- ఫ్యాన్ గుర్తు సరిగ్గా కనిపించలేదంటూ వాపోయిన వృద్ధులు



ఎంఆర్‌నగరంలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువత

నియోజకవర్గాల వారీగా ప్రతి రెండు గంటలకు పోలైన ఓట్ల శాతం

పార్వతీపురం	8.8	18.52	43.27	54.62	68.21	71.36	76.59
పాలకొండ	4.45	15.26	32.47	52.56	67.82	70.09	74.03
కురుపాం	7	16	34	52	57.02	63	74
సాలూరు	5.07	12.08	30.2	48.09	61.0	61.35	76.30

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ సాధారణ ఎన్నికల పోలింగ్ స్వల్పంగా చెదురుమదురు ఘటనలు మినహా సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగియగా..పార్వతీపురం నియోజకవర్గంలో 6 గంటల వరకూ నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ ఉదయం నుంచి జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఆయా నియోజకవర్గాల్లో పర్యవేక్షణ చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల సరిపడా టెంట్లు లేకపోవడంతో ఓటర్లు ఎండలోనే గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. వృద్ధులు సైతం పోలింగ్ కేంద్రాల వద్దకు సహాయకులతో పెద్దఎత్తున చేరుకుని ఓటు వేశారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. డీఐజీ విశాల్ గున్నీ పాలకొండలోని ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాల వద్ద గల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పాలకొండలో సాయంత్రం 4.30 గంటల సమయంలో భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షం పోలింగ్‌కు కాసేపు అంతరాయం కలిగించింది. అయినప్పటికీ ఓటర్లు బారులు తీరే ఉన్నారు. సాలూరులోనూ వర్షం ప్రభావం చూపింది. ఉదయం 9 గంటల సమయానికి జిల్లాలో 6.30 శాతం, 11 గంటలకు 15.54 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 34.98, మధ్యాహ్నం 3కు 51.75, సాయంత్రం 5 గంటల సమయానికి 63.51 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటు వేసిన కలెక్టర్ దంపతులు

పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బ్రాంచ్ స్కూల్) పోలింగ్ కేంద్రం 32లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్, ఆయన సతీమణి కరుణ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక కూడా ఇదే పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి స్వగ్రామం వండువలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చెదురుమదురు ఘటనలు

కొన్ని ప్రాంతాల్లో టీడీపీ, జనసేన శ్రేణులు.. వైఎస్సార్‌సీపీ వారిని రెచ్చగొడుతూ ఘర్షణ వాతావరణం సృష్టించారు. పార్వతీపురం నియోజకవర్గంలోని పెదబొండపల్లి, నర్సిపురం, పట్టణంలోని 3వ వార్డు, 16వ వార్డు తదితర ప్రాంతాల్లో స్వల్ప ఘర్షణలు జరిగాయి. కురుపాంలోని శివన్నపేటలో చిన్నపాటి ఘర్షణ జరిగింది. సాలూరులోని రామా కాలనీ, వేదసమాజం వీధి, గుమడాం, పాచిపెంట మండలం పాంచాలి తదితర ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు సంభవించాయి.

నిర్ణీత సమయం దాటినా బారులు తీరిన ఓటర్లు

పార్వతీపురం పట్టణంలోని కేపీఎం హైస్కూల్, ఎస్‌వీడీ డిగ్రీ కళాశాల, ఠాగూర్ ఎంఈ పాఠశాల, మండలంలోని నర్సిపురం తదితర ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటలైనప్పటికీ ఓటర్లు బారులు తీరారు. ఆ సమయానికి గేటు లోపల ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. కొన్నిచోట్ల అప్పటికే 300 మందికిపైగా ఉండడం గమనార్హం. సాలూరు నియోజకవర్గంలో సుమారు 50 పోలింగ్ బూత్‌లలో నిర్ణీత సమయం 5 గంటల దాటాక కూడా పోలింగ్ కొనసాగింది. ఈవీఎంలు చాలా చోట్ల మొరాయించాయి. ఈవీఎంలలో చాలాచోట్ల ఫ్యాన్ గుర్తు కనిపించలేదని వృద్ధులు తెలిపారు. చిన్న పరిణామంలో ఉండడం వల్ల ఎవరికి ఓటు వేశామో అర్థం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిన ఈవీఎంలు

పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం పార్వతీపురంలోని ఉద్యాన కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలకు ఈవీఎంలను తరలించి భద్రపరిచారు. వాటికి అవసరమైన సీల్ వేసి, సీసీ కెమెరాల నిఘాలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటర్లు ఇచ్చిన తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. వచ్చే జూన్ 4 వ తేదీన ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.



పార్వతీపురంలో ఓటు వేసేందుకు యువకుల సాయంతో వస్తున్న వృద్ధుడు



నర్సిపురంలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు



పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన మందులతో వైద్యసిబ్బంది



నర్సిపురంలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు

తొలిసారి ఓటు వేశా..



మంచి భవిష్యత్తు కోసం ఆలోచించి నిర్ణయం తీసుకున్నా. తొలిసారి ఓటు వేసినందుకు ఆనందంగా ఉంది. యువతంతా ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకున్నారని భావిస్తున్నా.

– స్వాతి, దిబ్బగుడ్డివలస, పార్వతీపురం మండలం

ఓటు వేసిన ప్రముఖులు



పార్వతీపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్ దంపతులు



సాలూరు పట్టణంలోని బాలికల హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర



బలిజిపేట: చిలకలపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు



వీరఘట్టం మండలం వండవలో ఓటు వేసిన వేలిని చూపిస్తున్న కళావతి



పెదమేరంగిలోని పోలింగ్ కేంద్రం వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి



నీలానగరంలో ఓటు వేసిన ఎమ్మెల్సీ విక్రాంత్ దంపతులు

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంల తరలింపు

సాక్షి పార్వతీపురం మన్యం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జిల్లాలో సోమవారం ముగిసింది. పోలింగ్ అనంతరం పార్వతీపురం పట్టణంలోని ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను పటిష్ట భద్రత మధ్య తరలించారు. తరలించిన ఈవీఎంలను కలెక్టర్ నిషాంత్ కుమార్ పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేలా పర్యవేక్షించారు.



ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది (ఇన్‌సెట్లో) పర్యవేక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, జేసీ శోభిక

ఓటేసి ఇంటికెళ్తూ హిజ్రా మృతి



హిజ్రా బిడ్డిక రాజారావు మృతదేహం

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తన ఓటు హక్కు వినియోగించుకుని ఇంటికి వెళ్తుండగా స్పృహ కోల్పోయి కింద పడి ఓ గిరిజన హిజ్రా మృతిచెందాడు. గుమ్మలక్ష్మీపురం మండలంలో సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదఖర్జ గ్రామానికి చెందిన బిడ్డిక రాజారావు (55) సోమవారం ఉదయం గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వెళ్లాడు.అందరితో పాటు లైన్‌లో నిలబడి సుమారు 11 గంటల సమయంలో ఓటు వేశాడు. అనంతరం ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో స్పృహ తప్పి పడిపోయాడు. ఈ విషయం గమనించిన స్థానికులు తట్టిలేపినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే మృతిచెందాడు. అప్పటివరకూ తమతో పాటే ఓటు హక్కును వినియోగించుకున్న రాజారావు ఆకస్మికంగా మృతిచెందడం పట్ల గ్రామస్తులంతా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. మృతుడు రాజారావు చెల్లి శ్రీదేవికి వివాహమైంది. ఒక్కడే ఇంట్లో నివాసముండేవాడు. సొంత వారు ఎవరూ లేకపోవడంతో గ్రామస్తులే హిజ్రాకు చేయాల్సిన ఆచారాల ప్రకారం ఖననం చేశారు.

ఆంద్రలో 9 గంటల వరకు పోలింగ్

మెంటాడ: మండలంలోని ఆంద్ర పోలింగ్ కేంద్రంలో సోమవారం రాత్రి 9 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో వాహనాలు, సెల్‌ఫోన్‌ల వెలుతురులో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు.



ఆంద్ర పోలింగ్ కేంద్రంలో రాత్రి సమయాన సాగుతున్న పోలింగ్

క్లుప్తంగా

ఓటేసిన కొద్ది సేపటికే మృత్యువాత



సత్యం మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య చంద్రమ్మ

డెంకాడ: అంతవరకు బాగానే ఉన్నాడు. భార్యతో కలిసి ఓటు వేసి ఇంటికి వచ్చిన కాసేపటికి ఆ వృద్ధుడు మరణించాడు. ఈ విచారకర సంఘటన మండలంలోని డెంకాడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. డెంకాడ గ్రామానికి చెందిన కోయనేని సత్యం (85) భార్య చంద్రమ్మతో కలిసి పోలింగ్ బూత్‌కి వెళ్లి ఓటు వేసి తిరిగి ఇంటికి చేరుకున్నాడు. అక్కడకు కొద్దిసేపటి తర్వాత కన్ను మూశాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



అసిరయ్య మృతదేహం

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామ సమీపంలో ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుడివాడకు చెందిన దుప్పాడ అసిరయ్య తన పనులు ముగించుకుని గ్రామానికి వస్తుండగా... గ్రామ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి అసిరయ్యను విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు కార్తీక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఓటర్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు ఇక్బాల్

రామభద్రపురం: మండలంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు ఇక్బాల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓలతో మాట్లాడుతూ, పోలింగ్ సరళిపై ఆరా తీశారు. పోలింగ్ బూత్‌ల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఓటర్లతో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ సులోచనారాణి ఉన్నారు.

కొత్తూరులో ఈదురుగాలుల బీభత్సం

- పోలింగ్ స్టేషన్ల వద్ద ఎగిరిపోయిన టెంట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా

కొత్తూరు : సార్వత్రిక ఎన్నికల వేళ కొత్తూరులో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు నేలకొరిగాయి. పలుచోట్లు చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో పోలింగ్ స్టేషన్ల వద్ద జనరేటర్లను సిద్ధం చేశారు. అవి కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. రాత్రి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు గ్రామాలు అంధకారం అలముకుంది. విద్యుత్ సరఫర నిలిచిపోవడంతో పోలంగ్ స్టేషన్ వద్ద జనరేటర్లు సక్రమంగ పనిచేయక పోవడంతో పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొత్తూరు, మెట్టూరులతో పాటు పలు గ్రామాల్లో గంటల తరబడి ఈవీఎంలు మొరాయించాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కొత్తూరుతో పాటు పలు పోలింగ్‌స్టేషన్‌లను అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్ సందర్శించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

అంధవరంలో దాడి

జలుమూరు: మండలంలోని అంధవరం పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సవలాపురం రాముపై అదే గ్రామానికి చెందిన పల్లి శంకరరావు, తిరుమలరావులు సోమవారం దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓట్లు పడటంతో ఓర్వలేని టీడీపీ వర్గీయులు రెచ్చకొట్టే మాటలు ఆడుతూ ఓటు వేసి వచ్చిన రామును నేలపై దొర్లించి రాయితో కంటి కింద గాయం చేశారు. స్థానిక వైద్యసిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మధుసూదనరావు సిబ్బందితో వెళ్లి పరిస్థితి సద్దుమణిగించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

20న పైడితల్లి దేవర మహోత్సవం

- 21 నుంచి చదురుగుడిలో పైడితల్లి దర్శనం
- చాటింపు వేసిన ఆలయ తలయారీలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న పైడితల్లి అమ్మవారు



ఆలయ ఆవరణలో చాటింపు ప్రక్రియలో పాల్గొన్న ఆలయ పూజారులు, భక్తులు



కోటవద్ద చాటింపు వేస్తున్న తలయారీలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తలయారులు సోమవారం చాటింపు వేశారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో ఉత్సవ చాటింపు ప్రక్రియను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ మేరకు స్థానిక మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ తలయారులు డప్పు వాయిద్యాలతో అమ్మవారికి మనవి చెప్పారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో దేవర మహోత్సవం చాటింపు వేశారు. అలాగే చిన పైడిరాజు బృందం డప్పులతో ఆలయంలోను, కోట వద్దనున్న కోటశక్తి అమ్మవారికి మనవి చెప్పారు. అనంతరం ఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న సోమవారం సాయంత్రం 4 గంటలకు రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అక్కడ నుంచి బాజా,భజంత్రీలు, మేళ తాళాలతో అమ్మవారిని రైల్వేస్టేషన్ నుంచి గాడీఖానా, సీఎంఆర్ జంక్షన్, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకపరమేశ్వరి ఆలయం, న్యూపూర్ణ జంక్షన్ మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటివద్దకు తీసుకువెళ్తారన్నారు. అక్కడ అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాత్రి 12 గంటలు దాటిన తర్వాత మేళతాళాల నడుమ శివాలయం మీదుగా పెద్దచెరువు పశ్చిమభాగానికి చేరుకుని అక్కడ పెద్దచెరువులో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అక్కడ నుంచి వేకువజామున అమ్మవారిని మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడికి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారన్నారు. మంగళవారం వేకువజామున 6 గంటల నుంచి అమ్మవారు ఆరు నెలల పాటు చదురుగుడిలోనే భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, సూపర్‌వైజర్ ఏడుకొండలు, పైడిమాంబ కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చదురుగుడిలో అమ్మవారికి డప్పు వాయిద్యాలతో మనవి చెబుతున్న చినపైడిరాజు బృందం

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్ నాగలక్ష్మి





ఎన్నికల కంట్రోల్ రూమ్ నిర్వహణను మానటరింగ్ చేస్తున్న జిల్లా ఎన్నిక అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో సాధారణ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. అక్కడక్కడా ఈవీఎంల్లో స్వల్ప అవాంతరాలు తలెత్తగా వెంటనే అధికారులు స్పందించి సరిచేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,847 పోలింగ్ కేంద్రాల్లో తొలుత పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఆ తరువాత పుంజుకుంది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు బారులుతీరారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఉదయం 5.30 గంటలకే చాలా పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఎండను దృష్టిలో ఉంచుకొని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు వేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పలు చోట్ల అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో చిన్న పిల్లల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల్లోకి చేరుకోవడానికి ర్యాంపులు కూడా ఉండడంతో దివ్యాంగులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ కలగలేదు. అంధులకోసం అభ్యర్థుల జాబితాలను బ్రెయిలీ లిపిలో పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. జిల్లాలోని మొత్తం 11 మోడల్ పోలింగ్ కేంద్రాల్లో మరిన్ని అదనపు హంగులు ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షణ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూం నుంచి పోలింగ్ ప్రక్రియను రోజంతా పర్యవేక్షించారు. ఆమె ఉదయం 4.30 గంటలకే కంట్రోల్ రూమ్‌కి చేరుకున్నారు. అప్పటి నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఆర్ఓల ద్వారా పోలింగ్ బూత్‌ల్లో పరిస్థితి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వచ్చారు. అవసరమైన ఆదేశాలను జారీచేసి పోలింగ్ సిబ్బందిని ముందుకు నడిపించారు. ఉదయం 5.45 గంటలకల్లా మాక్ పోల్ పూర్తి చేసేలా పోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈవీఎంల్లో సమస్యలు తలెత్తిన చోట, వెంటనే సంబంధిత అధికారులను హెచ్చరించి, వాటిని సరిచేసి పోలింగ్ కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై మరింత దృష్టి సారించారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ నడిపించారు.

విస్తృతంగా పర్యటించిన ఎన్నికల పరిశీలకులు

ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పోలింగ్ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. మైక్రో అబ్జర్వర్ల ద్వారా పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పోలీస్ పరిశీలకులు సచింద్ర పటేల్, జిల్లా వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రంజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ జిల్లాలో పర్యటించి, పోలింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు



ఈవీఎంలు భద్రపరిచే తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



లెండీ ఇంజనీరింగ్ కళాశాల లోపలకు ఈవీఎంలను తీసుకెళ్తున్న సిబ్బంది

విజయనగరం అర్బన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. ఇప్పటికే కేటాయించిన రిసెప్షన్ సెంటర్లకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన 1,874 పోలింగ్ కేంద్రాల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లను తరలిస్తున్నారు. డెంకాడ మండలం లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం, చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల ఈవీఎంలు, జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరుస్తున్నారు.

అధికారుల అత్యుత్సాహం..

కూటమికి సహకారం



గిరివానిపాలెంలో పోలింగ్ అధికారి తిరుపతిరావు

రణస్థలం: మండలంలోని రెండు చోట్ల బీజేపీ, టీడీపీకి అనుకూలంగా ఎన్నికల అధికారులు అత్యుత్సాహం చూపించారు. ఈ విషయమై బంటుపల్లి, గిరివానిపాలెం బూత్ ఏజెంట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్వీ లక్ష్మణ మూర్తికి ఫిర్యాదులు చేశారు. గిరివానిపాలెం 142 పోలింగ్ కేంద్రంలో ఎన్నికల పోలింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు బీజేపీ, టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారని, వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసిన సమయంలో వాళ్లకి సహాయంగా వచ్చిన వారిని ఈవీఎంల వద్దకు పంపకుండా నేరుగా వెళ్లి ఓట్లు వేశారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు. ఇలోగా ఇప్పిలి చిన్న అనే వృద్ధుడు ఓటు తన కుమార్తె సమాయంతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. బూత్ ఏజెంట్లు పరిశీలించి ఓటు వేయడానికి ఈవీఎంల దగ్గరకు వెళ్లినప్పుడు పీఓ కూడా వెళ్లారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వృద్ధుడు చెప్పగా పీవో సైకిల్‌పై బటన్ నొక్కడం, ఇది గమనించిన అతని కుమార్తె ఎందుకిలా చేశారని నిలదీశారు. దీంతో గందరగోళం ఏర్పడింది. ఇలా అప్పటికే యాభై పైచిలుకు ఓట్లు వేశారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎల్.రామారావు పోలింగ్ కేంద్రానికి వచ్చి వివాదం సద్దుమణించారు. బూత్ ఏజెంట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్వో కార్యాలయానికి పీవో తిరుపతిరావును సరెండర్ చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా పీవోపై చర్యలు తీసుకుంటామని ఆర్వో లక్ష్మణమూర్తి తెలిపారు. బంటుపల్లి పోలింగ్ కేంద్రం 185, 186లో ఇజ్జు దుర్గా ప్రసాద్ రెండు సార్లు ఓట్లు వేయడంపై అభ్యంతరం తెలుపుతున్నా వీఆర్వో చిన్నారావు నేరుగా ఓటు వేయించారని బూత్ ఏజెంట్లు ఆర్వోకు ఫిర్యాదు చేశారు.

• పోలీస్ సేవలు భేష్



వృద్ధురాలిని తీసుకువస్తున్న మహిళా పోలీస్



దివ్యాంగుడిని వీల్‌చైర్ ఎక్కిస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది అందించిన సేవలను పలువురు అభినందించారు. జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్, కణపాక, జొన్నగుడ్డి, సుంకరివీధి, ఆబాద్‌వీధి, కొత్త దేవరవీధి, తదితర ప్రాంతాల్లో సోమవారం ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు సేవలందించారు. వీల్‌చైర్ల ద్వారా వృద్ధులను కేంద్రంలోకి తీసుకురావడం, ఓటు వేసిన తర్వాత బయటకు తీసుకెళ్లడం వంటి పనులతో పోలీసులు ప్రజల మన్ననలు అందుకున్నారు. అలాగే సత్య కళాశాల, ఎంఆర్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఓటర్లకు సహకరించారు.

టీడీపీ నేతల 'విష' ప్రయోగం



చనిపోయిన రొయ్యిలు

పోలాకి: మండలంలోని బెలమర గ్రామానికి చెందిన చింతు అప్పన్న అనే ఆక్వా రైతుకు చెందిన రొయ్యల చెరువుల్లో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారు. దీంతో రొయ్యిలన్నీ చనిపోయాయి. బాధితుడు పోలాకి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు వైఎస్సార్‌సీపీ సానుభతిపరుడు కావడంతో ఎన్నికల నుంచి డైవర్ట్ చేసే ప్రయత్నంగా దుండగులు ఈ చర్యకు పాల్పడినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనిపై ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ స్పందించారు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామని చెప్పారు.

గొడవకు దిగిన కూటమి నేతలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి పోలింగ్ బూత్ వద్ద స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం ఎదుట టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు వైస్సార్‌సీపీ నాయకులతో సోమవారం బాహాబాహీకి దిగారు. అంతలో అక్కడకు వచ్చిన పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్ ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితి సద్దుమణిగించారు.

నిలిచిపోయిన పాసింజర్ రైలు




రైలు ఆగిపోవడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

- ఇబ్బంది పడిన ప్రయాణికులు

గజపతినగరం: ఇంజిన్ ఫెయిల్ అవడంతో ప్యాసింజర్ రైలు గజపతినగరం రైల్వేస్టేషన్ వద్ద సుమారు రెండు గంటలు నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ నుంచి విశాఖపట్నం వస్తున్న పాసింజర్ ఇంజిన్ ఫెయిల్ కావడంతో సోమవారం సాయంత్రం గజపతినగరం రైల్వేస్టేషన్ వద్ద నిలిచిపోయింది. రైల్వే అధికారులు వేరే ఇంజిన్ ఏర్పాటు చేయడంతో రైలు విశాఖపట్నం వెళ్లింది.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలు

- పోలింగ్ కేంద్రాల వద్ద ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు హడావిడి
- సెల్‌ఫోన్లతో అనుచరులు ఓవరాక్షన్



గుజరాతీపేట పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లతో రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్ కూటమి అభ్యర్థి కె.రామ్మోహన్‌నాయుడు హడావిడి చేశారు. క్యూలైన్లలో ఉన్న ఓటర్లను ప్రలోభపెట్టేలా ఓటు వేయకముందే వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ప్రలోభపెట్టారు. తమ సిబ్బందితో ఫోటోలు దిగిన వారి వాట్సాప్ నంబర్లను తీసుకున్నారు. ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్ల అనుమతి లేదని స్వయంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితేనా రామ్మోహన్‌తోపాటు అనుచరులంతా సెల్‌ఫోన్లలో పోలింగ్ కేంద్రాల వద్ద హంగామా సృష్టించడం విమర్శలకు తావిచ్చింది. స్థానిక టీడీపీ నాయకులు కూడా ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లింఘించారు. గుజరాతీపేటలోని వరం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ కేంద్రం వద్ద టీడీపీ నేతాలు ఓటర్లకు ప్రలోభపెట్టారు. ప్రధాన గేట్ వద్ద సైకిల్‌కు ఓటు వేయాలంటూ వరం కుమారులు, స్థానిక టీడీపీ నాయకులు చేసిన రచ్చ చేశారు. దీంతో ప్రత్యేక బెటాలియన్‌తోపాటు ఎస్పీ జీఆర్ రాధిక కూడా పోలింగ్ కేంద్రానికి చేరుకుని శాంతిభద్రతలను స్వయంగా పర్యవేక్షించారు. స్థానిక నాయకులను అక్కడ నుంచి పంపించి వేశారు.